క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పోలీస్ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఆలయాభివృద్ధికి విరాళం



శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులకు రూ.50 వేలు విరాళం అందిస్తున్న దృశ్యం

ఆలూరు: ఆలయాల నిర్వహణకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక కోటవీధిలో కొలువుదీరిన శ్రీ సిద్ధేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా ఆలయకమిటీ పెద్దలు, వీరశైవ లింగాయతీ సంఘం నాయకులకు రూ 50 వేలు విరాళంగా అందజేశారు. అలాగే ఎల్లార్తి గ్రామం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకందారమ్మ ఆలయం నిర్మాణానికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు.

తొలగించిన ఓట్లపై పకడ్బందీగా సర్వే

వెల్దుర్తి: గతేడాది జూన్ నుంచి ఓటరు జాబితాలో తొలగించిన ఓట్ల సర్వేను బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పక్కాగా చేపట్టాలని పత్తికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మోహన్‌దాస్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని బోయనపల్లె, రామళ్లకోట గ్రామాల్లో బీఎల్ఓలు కొనసాగిస్తున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు. తొలగించిన ఓట్లకు సంబంధించి ధ్రువపత్రాలు కచ్చితంగా ఉండాలని, వారి కుటుంబీకులు, చుట్టుపక్కల వారి సాక్ష్యాలు పొందుపరచాలన్నారు. అనంతరం బోయ నపల్లె పోలింగ్ బూత్‌ను సందర్శించారు. డీటీ ప్రసాద్‌రాజు, వీఆర్ఓ రమణారెడ్డి, బీఎల్ఓలు ఉన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

పత్తికొండటౌన్: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషిచేయాలని జిల్లా జడ్జి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సాయంత్రం పత్తికొండ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటుచేసిన సదస్సుకు జిల్లా జడ్జి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పత్తికొండకు వచ్చిన జిల్లా జడ్జి శ్రీనివాసరావు, లోక్‌అదాలత్ కార్యదర్శి నాగశ్రీనివాసరావులకు స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి దివ్య, న్యాయవాదులు, పోలీసు అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడు తూ పెండింగ్ కేసుల వల్ల కోర్టులలో పని భారం అధికమవుతోందన్నారు. కోర్టులలో కేసుల విచారణలో జరుగుతున్న జాప్యం వల్ల కక్షిదారులకు సకాలంలో న్యాయం జరగడం లేదన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్‌అదాలత్ జిల్లా కార్యదర్శి నాగశ్రీనివాసరావు, పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మన్న, ఏపీపీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణయ్య, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



అమకతాడులో నీటి తొట్టెను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య

కృష్ణగిరి: ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య సూచించారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి 104 ద్వారా అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మురుగునీరు నిలిచిన ప్రాంతాలను, నీటి తొట్టెలను పరిశీలించి సిబ్బంది సూచనలు, సలహాలు ఇచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చాలా ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లకున్నా ప్రతి నెల ప్రతి గ్రామంలో రెండు రోజులు 104 వాహనం వెంట వైద్యులు వచ్చి సేవలు అందిస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ముఖ్యంగా వాటర్ ట్యాంకులు, ఇళ్లలోని తొట్లను నిత్యం శుభ్రం చేసుకుంటూ బ్లీచింగ్‌పౌడర్‌ను వేసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టడంలో పంచాయతీ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వైద్యాధికారి ప్రదీప్, ఎంపీహెచ్ఓ గజేంద్రారెడ్డి, ఎంపీహెచ్ఎస్ పద్మావతి ఉన్నారు.

మందులకు ఇబ్బంది లేదు



గిరిగెట్ల గ్రామానికి చెందిన అరవ చిన్న బసన్న తనకున్న రెండెకరాలలో చిన్న కొడుకుతో కలిసి వ్యవసాయం. కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని నెట్టుకొస్తున్నాడు. చిన్న బసన్నకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. భార్య అరవ లక్ష్మిదేవి పది నెలల క్రితం పక్షవాతానికి గురైంది. భర్త పింఛన్ డబ్బుతోనే వైద్యం చేయిస్తున్నారు. ఇటీవల భార్యకు వలంటీర్ ద్వారా పింఛన్ కోసం దరఖాస్తు చేస్తుకున్నారు. ప్రభుత్వం లక్ష్మిదేవికి కొత్తగా పింఛన్ మంజూరు చేయడంతో శుక్రవారం పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందుకుంది. కుటుంబంలో రెండు పింఛన్లు కావడంతో మందులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని కృతజ్ఞతతో చెబుతోంది.

వితంతు పింఛనే ఆసరా



ఈమె పేరు పాలకొమ్ము సువార్తమ్మ. నందవరం మండలం. గురజాల గ్రామ నివాసి. వృద్ధురాలైన ఈమె భర్త ఏడాది కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. 6 నెలల క్రితం వితంతువు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. శుక్రవారం గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా పింఛన్ రూ.2,750 అందుకుంది. ఎలాంటి సిఫారస్సు లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్ అందించడంతో ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం జగనన్నకు రుణపడి ఉంటానని పేర్కొంది.

చెప్పలేని ఆనందం



ఈ ఫొటోలో ఉన్న వృద్ధురాలు పి.లక్ష్మిదేవి. వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందిన మహిళ. భర్త రామచంద్రుడు. మూన్నెళ్ల క్రితం వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోయాడు. వెంటనే వలంటీర్ మాలిక్‌బాష లక్ష్మిదేవికి స్థానిక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రవి ద్వారా వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేయించాడు. రెన్నెళ్లలో వితంతు పింఛన్ మంజూరైంది. శుక్రవారం వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందించడంతో ఆనందం వెలిబుచ్చింది.

కొత్తగా ఆనంద'మనీ'పింఛన్

నందవరం: అర్హతే ప్రామాణికంగా పేదలందరకీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆయా గ్రామాల సర్పంచులు విరుపాక్షిరెడ్డి, వీరస్వామి, లక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముగతి, నాగలదిన్నె, గురజాల గ్రామాల్లో లబ్ధిదారులకు గ్రామ సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో వలంటీర్లు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

చిప్పగిరి: మండలంలో ప్రభుత్వం కొత్తగా 146 పింఛన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారుల దారుల సంఖ్య 3,500 కు చేరింది. మొదటి రోజు శుక్రవారం వలంటీర్ల ద్వారా 80% శాతానికి పైగా పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఆలూరు రూరల్: ఆలూరు మండలంలో ఇప్పటి వరకు 5,964 మందికి సామాజిక పింఛన్లు అందిస్తుండగా ఈ ఏడాది రెండోసారి 181 మంది కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేశారు. దీంతో నూతన పింఛన్లు అందుకుంటున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పరి: ఆస్పరి సచివాయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, మండల సొసైటి చైర్మన్ కట్టెల గోవర్ధన తదితరులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని 33 గ్రామాల్లో తొలిరోజు 74 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. మండలానికి కొత్తగా 170 ఫించన్లు మంజూరయ్యాయని, మొత్తం 7,180 మందికిగాను 5,300 మందికి సొమ్ము పంపిణీ పూర్తయ్యిందని వెల్లడించారు.

తుగ్గలి: మండలంలో మొత్తం 7,682 మంది పింఛన్ దారులకు ప్రభుత్వం రూ.2,12,47,500 మంజూరు చేసింది. వలంటీర్లు శుక్రవారం వేకువజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. సాయంత్రానికి 58.69 శాతం పంపిణీ పూర్తి చేశారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జొన్నగిరి గ్రామానికి చెందిన మద్దికెర రమేష్‌కు వలంటీర్ బ్రహ్మనందరెడ్డి ఆస్పత్రికే వెళ్లి వృద్ధాప్య పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్ సేవకు లబ్ధిదారుడు సంతోషం వ్యక్తం చేశాడు.



ఆస్పరిలో కొత్తగా మంజూరైన ఫించన్ దారులకు డబ్బులు అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా సచివాయాల్లో లబ్ధిదారులకు శుక్రవారం సర్పంచులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. మండలంలోని 23 సచివాలయాల్లో 180 మందికి కొత్తగా పింఛన్లు వచ్చినట్లు ఎంపీడీఓ బంగారమ్మ తెలిపారు.

గోనెగండ్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కోఆప్షన్ మెంబర్ బందెనవాజ్ అన్నారు. గోనెగండ్ల మండలంలో 225 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు అయ్యాయి. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, సర్పంచ్ హైమావతితో కలిసి బందెనవాజ్ పింఛన్లను పంపిణీ చేశారు

వెల్దుర్తి: మండలానికి కొత్తగా మంజూరైన 152 పింఛన్లతో కలిపి శుక్రవారం పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు ఎంపీడీఓ శ్రీనవాసరావ్ తెలిపారు. రామళ్లకోట గ్రామంలో మంజూరైన 15 కొత్త పింఛన్లలో కొన్నింటిని తహసీల్దార్ శివరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాషలు గ్రామసభలో పంపిణీ చేశారు. నూతన పింఛన్ అందుకున్న లబ్ధిదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండల వ్యాప్తంగా 7850 పింఛన్లలో దాదాపు 70 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, మల్లికార్జున, రామకృష్ణ, తదితరులు పంపిణీ చేశారు. కొత్తగ మంజూరైన 176 పింఛన్లతో కలిపి మొత్తం 5,920 పింఛనుదారులు ఉండగా శుక్రవారం 4 వేల మందికి (60 శాతం) పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ తెలిపారు.

దేవనకొండ: మండలానికి కొత్తగా 197 పింఛన్‌లను మంజూరైనట్లు ఎంపీడీఓ గౌరీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నేలతలమరి గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్‌లను పంపిణీ చేశారు.



అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మద్దికెర రమేష్‌కు పింఛన్ అందిస్తున్న జొన్నగిరి వలంటీర్ బ్రహ్మనంద రెడ్డి

హాలహర్వి: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఎంపీటీసీ లింగప్ప చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. తొలిరోజు మండలంలో 78 శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తి అయ్యిందని ఎంపీడీఓ ఆంతోనీ వెల్లడించారు.

పత్తికొండటౌన్: పత్తికొండ మండలానికి 340 కొత్త పెన్షన్లు మంజూరయినట్లు ఎంపీపీ ఎం.నారాయణదాసు, ఎంపీడీఓ కవిత తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామ వాలంటీర్లు క్రొత్తగా పెన్షన్లు మంజూరయిన లబ్ధిదారులకు నగదును పంపిణీ చేశారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాసు చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్కసాగరం రాముడు నూతనంగా మంజూరైన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు.



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నారాయణదాసు



నాగలదిన్నెలో వృద్ధురాలు ముద్దమ్మకుకు పింఛన్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హొళగుందలో దివ్యాంగురాలు హసినాకు పింఛన్ ఇస్తున్న వలంటీరు నూరీ



నేలతలమరిలో కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా



నాకు పుట్టుక నుంచి పోలియో సోకడంతో రెండు కాళ్లు వంకరగా ఉండేవి. కుటుంబ పోషణ కోసం గ్రామాలకు వెళ్లి ఫినాయిల్ అమ్మి జీవనం సాగిస్తున్నాను. ఐదేళ్ల క్రితం సదరం క్యాంపు సర్టిఫికెట్ ఎలా పొందాలో తెలియక ఇబ్బంది పడ్డాను. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలోనే సదరం క్యాంపు ఏర్పాటు చేయడంతో అక్కడి వెళ్లి సర్టిఫికెట్ తీసుకున్నాను. రెండు నెలల క్రితం దరఖాస్తు చేసుకోగా శుక్రవారం రూ.3 వేల పింఛన్ అందింది ఆర్థికంగా తోడు నిలిచిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాను. – ఈరన్న, వికలాంగుడు, కోయనగర్, ఆలూరు

ఆనందంగా ఉంది



పింఛన్ మంజూరు అయినందుకు చాలా ఆనందంగా ఉంది. నా భర్త చనిపోయి మూడేళ్లయింది. కొన్ని అనివార్య కారణాల వల్ల దరఖాస్తు చేసుకున్నా పింఛన్ మంజూరు కాలేదు. వలంటీర్ శ్రీకాంత్ పలు మార్లు నా దగ్గరికి వచ్చి ఆందోళన చెందవద్దు కచ్చితంగా పింఛన్ వస్తుందని ధైర్యం చెప్పేవాడు. రెండుమూడు సార్లు ఆఫీస్‌కు తీసుకెళ్లి ఆధార్‌కార్డు ఇతర వివరాలను సరిచేయించి పింఛన్ మంజూరు చేయించాడు. తొలిసారి పింఛన్ అందుకోవడం ఆనందంగా ఉంది.

– రామలక్ష్మి, మద్దికెర

వలంటీరే దరఖాస్తు చేయించారు



ఇంతకు ముందు నా భర్తకు పింఛన్ వచ్చేది. ఆయన కొన్ని నెలల కింద మరణించాడు. దీంతో వలంటీరు ఇంటికి వచ్చి ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, నా భర్త డెత్ సర్టిఫికెట్ తీసుకెళ్లి నాకు పింఛన్ కోసం దరఖాస్తు చేసింది. ఈ నెల కొత్త పింఛన్ మంజూరు కావడంతో వలంటీర్ ఇంటికొచ్చి నా చేతికి రూ.2,750 అందజేయడం ఎంతో ఆనందం ఉంది.

– గాశెమ్మ, హొళగుంద

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్



మహిళలకు సంపూర్ణపోషణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు రోఖియాబేగం

ఎమ్మిగనూరుటౌన్: గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాలామృతం, పోషకాహారాన్ని ఐసీడీఎస్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రోఖియాబేగం, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. పోషన్ మాహ్ మాసోత్సవాల ప్రారంభోత్సవం, ఉమెన్స్ డిగ్నిటీ డే పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని 11వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది తయారు చేసిన పోషకాహారం, చిరుధాన్యాల ఆహార పదార్థాల స్టాళ్లను పరిశీలించి బాలింతలు, గర్భిణులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల మహిళల్లో రక్తహీనత నివారించవచ్చన్నారు. ఐరన్ పుష్కలంగా ఉండేలా ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రు పాలు తాపాలని మహిళా కమిషన్ సభ్యురాలు సూచించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సఫరున్నిసాబేగం, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఐసీడీఎస్ ఏసీడీపీఓ మద్దమ్మ, బనవాసి కేవీకే శాస్త్రవేత్త అపర్ణ, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఈహెచ్ఎస్ డిస్పెన్సరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రికి పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు అనారోగ్యంతో వస్తుంటారని, వారి పట్ల డాక్టర్లు నిర్లక్ష్యం వహించకుండా ఓపికతో వైద్యం అందించాలని చెప్పారు. ఆసుపత్రిలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వంద పడకల ఆసుపత్రి అయితే ఇంకా మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని, పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, నాయకులు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జువాలజీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయరాణి సూచించారు. ఎంఎస్సీ బీఈడీ జువాలజీలో 60శాతం మార్కులు కలిగిన మహిళా అభ్యర్థులు తగిన విద్యార్హతల జిరాక్స్ కాపీలతో వారి బయోడేటాను ఈనెల 4వ తేదీలోగా కళాశాల కార్యాలయంలో ఇవ్వాలని కోరారు.

4 నుంచి రామళ్లకోటలో రీసర్వే

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట, నార్లాపురం, బోయనపల్లె, పేరేముల గ్రామ పరిధిలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకం కింద థర్డ్ ఫేస్ రీసర్వే ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రామళ్లకోటలో గ్రామ సభ నిర్వహించారు. రైతులు, ప్రజలు తమ భూములకు సంబంధించిన ధ్రువపత్రాలు చూపి సర్వేకు సహకరించాలని తహసీల్దార్ కోరారు. ప్రతి భూ కమతాన్ని అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా మార్క్ చేసి నంబర్ కేటాయిస్తామన్నారు. క్యూఆర్ కోడ్ సైతం ఇస్తామని, ఇకపై రికార్డులు తారుమారు చేయడం కుదరదని, పలు భూ సమస్యలు రీసర్వేతో పరిష్కారమవుతాయన్నారు. మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో పుల్లగుమ్మి, బుక్కాపురంలలో రీసర్వే పూర్తి చేసినట్లు, కలుగొట్లలో ఆఖరి దశలో కొనసాగుతున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి రామళ్లకోటలోని 3,033 ఎకరాలు, నార్లాపురం పరిధిలోని 3,898 ఎకరాలు, బోయనపల్లె పరిధిలోని 1,074 ఎకరాలు, పేరేముల పరిధిలోని 2,347 ఎకరాలను నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తామన్నారు. గ్రామ సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవస్వామి, రాధా కృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాష మాట్లాడారు. వీఆర్‌ఓ రామణారెడ్డి, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రాధాకృష్ణారెడ్డి

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం
- మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే
- పల్లెదొడ్డి కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు జయరాం



పల్లెదొడ్డిలో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ: గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ ధ్యేయమని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో అధికారుల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పొల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో స్వాగతం పలికారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు నారా లోకేష్ ఎక్కడ కాలు పెడితే అక్కడ కరువే ఏర్పడుతుందని ఆరోపించారు. కర్నూలు జిల్లాలో వారు అడుగుపెట్టినప్పటి నుంచి వర్షాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌కళ్యాణ్ గాలి మాటలను ప్రజలు నమ్మరని, ఏపీలో నిర్వహిస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడు డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని మరోసారి వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ పార్టీలను ప్రజలు చిత్తుగా ఓడించి జగనన్నను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన 'నవరత్నాలు–ప్రజలకు ఉపయోగాలు' కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, కో–కన్వీనర్ కబీర్‌దాస్, పల్లెదొడ్డి సర్పంచ్ రంగస్వామి, నాయకులు చంద్రన్న, లక్ష్మినారాయణ, శ్రీను, అరుణ్‌కుమార్, పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎస్ఐ భూపాలుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి, నాయకులు

ఆస్పరిలో కూరగాయల మార్కెట్ ప్రారంభం

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. మార్కెట్లో పూజలు చేశారు. అక్కడి రైతులతో మాట్లాడి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి, ఆయన సోదరులను కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర సన్మానించారు. కార్యక్రమంలో రాంభీంనాయుడు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీటి కొరత

చిప్పగిరి: ఏబీసీ కెనాల్ ఆయకట్టు రైతులు కొత్తగా పంటలు సాగు చేయవద్దని డీఈ మంజునాథ్ సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో నీటి మట్టం తక్కువగా ఉండడంతో ఏబీసీ కెనాల్‌కు నీటిని సరఫరా చేసే అవకాశం లేదని, పరిస్థితిని రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని రైతులకు సూచించారు. వారం పది రోజులలో అధిక వర్షాలు కురిస్తే పంటలు సాగుచేసుకోవచ్చని తెలిపారు.

పోటీ పరీక్షలతో ప్రతిభకు మెరుగు

మద్దికెర: పోటీ పరీక్షలు విద్యార్థి జీవితంలో ఒక భాగమని ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప, శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలస్థాయి డ్రాయింగ్ పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే తమ లక్ష్యమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్, ఆపద్బంధు వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రూ.68 లక్షలతో రాజగోపుర నిర్మాణం

మద్దికెర: పెరవలి రంగనాథస్వామి దేవాలయంలో రూ.68 లక్షలతో తూర్పు, దక్షిణ రాజగోపురాలు నిర్మించనున్నట్లు దేవాలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వారు తమ కార్యాలయంలో మాట్లాడుతూ.. గోపురాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈనెల 9వ తేదీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు. అలాగే దాతల సహకారంతో ఆలయంలో కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

నందవరం: సచివాలయ సిబ్బంది విధులు బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని గురజాల గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..సచివాలయ సిబ్బంది విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిసే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో అభివృద్ధి పనులు, పర్యావేక్షణపై ఆరా తీశారు. సర్పంచ్ వీరస్వామి, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి ఉన్నారు.

బిలేహాల్‌లో పొలంబడి

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో రైతు గంగాధర్‌గౌడ్‌కు చెందిన పత్తి పంట పొలంలో ఏఓ శివశంకర్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలం బడి లక్ష్యాలను ఏఓ వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరఆదాయం, నాణ్యమైన దిగుబడి పొందడం, సహజ సిద్ధమైన వనరులతో సాగు చేయడం, భూసార పరీక్షను బట్టి ఎరువులు వాడడం, వానపాములు, సేంద్రియ ఎరువుల వాడడం, రసాయన ఎరువులను తగ్గించడం, విత్తన శుద్ధితో చీడపీడలను నివారించుట, అంతర పంటల ద్వారా మిత్ర పురుగుల వృద్ధి చేయుట, ఎర పంటలు, లింగాకర్షక ఎరలను వాడి పురుగుల ఉనికిని గమనించడం తదితర పద్ధతులను వివరించారు. వీఏఏలు రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.